

కార్మికనగర్‌లో ప్రచారం చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దొందూ దొందే : కిషన్‌రెడ్డి

బోరబండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలనలో ప్రజా సంక్షేమం పట్టని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒకటేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. మార్పు అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ఏ మార్పూ రాలేదని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా రహ్మత్ నగర్ డివిజన్ బ్రహ్మశంకర్‌నగర్, ఓంనగర్, ఎస్‌ఎస్‌బీ నగర్, కార్మికనగర్ బస్తీల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో మజ్లిస్ పరోక్షంగా పెత్తనం చెలాయించాలని చూస్తోందని విమర్శించారు. అందుకే మజ్లిస్‌కు చెందిన అభ్యర్థి కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు టి.లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులు దర్శనం నాగేశ్వరరావు, సముద్రాల మల్లేష్‌గుప్తా, మహేష్, భరత్‌గౌడ్ పాల్గొన్నారు.

దోచిన డబ్బు ఢిల్లీకి : ఎమ్మెల్యే పాయల్ శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

బీఆర్‌ఎస్ దోచిన డబ్బును ఢిల్లీలోని కాంగ్రెస్‌కు అప్పగించిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవినీతిలో ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఎన్నికల ముందు మాటల గారడీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడెందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ సంపాదనను ఢిల్లీకి తరలించడంతో రాష్ట్ర ప్రభుత్వం కంటితుడుపు చర్యగా కేసులు పెట్టిందని ఆరోపించారు.

కండువా.. మారుస్తున్నడొదినా!

- బిర్యానీ, డబ్బులు ఎవరెక్కువ ఇస్తే వారికే జై
- రోజుకో పార్టీ తిరుగుతున్న కార్యకర్తలు

బంజారాహిల్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

- ఏవే లక్ష్మీ గింత పొద్దుగాల లేసి ముగ్గులు పెడుతున్నవ్.. ఊరికిగిన పోతున్నవా ఏందీ..
- ఏంలేదొదినా.. గిప్పుడే నా పెనిమిటి బయటకు పోయిండు పని ఉందని. ఇగ ఆయన కోసం లేసి చాయ్ పెట్టిచ్చి ఏం సేయాలో తెల్వక పనిలో పడ్డ..
- గదేందే గింత పొద్దుగాల పనేందీ.. ఊరికిగిన పోయిండా ఏందీ..
- కాదొదిన కొన్ని దినాలుగా గిదే తంతు పొద్దుగాలనే లేసి ఏదో పనిఉన్నట్టు పోతనే ఉన్నడు..
- ఎప్పుడు అడగలేదా నువ్వు మగోళ్లను గాలికి వదిలేస్తే ఎట్లా..
- అడిగిన వదినా ఎలచ్చన్లంట గదా పని ఉందంటూ పోతనే ఉన్నడు.
- ఓహో మస్తు సంపాదిస్తున్నడన్నమాట..
- సంపాదన ఎక్కడిది వదిన పొద్దుగాల సుక్కలు పోకముందే పోతుండు. మల్లా రాత్రి సుక్కలు నడినెత్తి మీదకు వచ్చినాక మస్తుగ తాగి ఊగుతూ వస్తుండు. ఏం చేస్తుండో తెల్వదు. ఖర్చులకు పైసలు ఇస్తలేడు. నిద్రలో ముక్కా, బిర్యానీ అని కలువరిస్తున్నడు. నాకేమో గుబులుగా ఉంటుంది. పిల్లలు కూడా బెంగ పెట్టుకుంటుండ్రు..
- ఏం కాదే ఎలచ్చన్లకు పనిచేస్తున్నట్టుంది.. లాస్టుకు మస్తు పైసలు ఇస్తరంట నేతలు
- ఒకే పార్టీలో ఉంటే ఇస్తరు. కానీ, నా పెనిమిటి రోజుకో పార్టీ మారుస్తుండు. ఇంట్లో యాడ చూసినా అన్నిపార్టీల కండువాలు ఉన్నయ్. ఏందయ్యా అని అడిగితే ఎవరు బిర్యానీ పెట్టి బీరు తాగిస్తే వాళ్ల దగ్గరకు పోతున్నా అంటుండు.
- మరి మీకు తిండి ఎట్ల అని అడగకపోయినవ్
- ఆ ముచ్చట గూడ అయిందొదినా.. నాకు ఓ కండువా వేసి మన పక్క డివిజన్‌లో మహిళ నిలబడిందంటా అక్కడ ప్రచారం చేసి రెండు పూటలు తినమంటున్నాడు. ఇంత కవర్ల పెట్టుకొచ్చి పిల్లలకు పెట్టమంటుండొదినా.. ఎలచ్చన్ల ముందు బుద్ధిగా పనిచేసేటోడు. గిప్పుడు బూత్‌లంటుండు. వేలంటుడు కానీ రూపాయి వస్తలేదు.



ఎంతిస్తరో చెప్పండి..

- అన్నా ఎలచ్చన్లలో పోటీ చేస్తున్న నాయకుడు ఫోన్ చేసిండే..
- ఏందంటరా బై ఏం కావాలంటా...
- ప్రతిపక్ష పార్టీ మస్తుగా ప్రచారం చేస్తున్నరంటా... దాన్ని దెబ్బ తీసేందుకు కొంతమంది నాయకులు చేరుతున్నట్టు ప్రచారం చేసుకుంటరట. కండువాలు కప్పుకునేందుకు ఆడోళ్లు.. యువకులు కావాలంటనే..
- అరే గిప్పుడు అందరూ ప్రచారంలో ఉన్నరు బై ఎట్ల కుదుర్తది.. కాదని సెప్పు..
- అన్నా ఎంతైనా ఇస్తడంటా... ఇజ్జత్‌కి సవాల్ అంటుండే..
- గింత అర్జెంట్ ఎట్లరా బై సరే ఓ పెట్టే(లచ్చ) పంపించమను. 50 మందిని పంపిస్తమని చెప్పు. రవాణా ఖర్చులన్నీ వాళ్లవే..
- అన్నా సరే అన్నడే. అడ్వాన్స్ గిప్పుడు పంపిస్తడంటా.. మంది కావాలే పంపిస్తరా..
- అన్నా ఇయ్యాల మన బృందంలో ఇరవై మంది బీఆర్‌ఎస్‌లో... 15 మంది కాంగ్రెస్.. 15 మంది టీడీపీ కండువాలు కప్పుకోవాలన్నా. ఇందుకోసం మనుషులను సిద్ధం చేయాలే...
- గట్లనేచేద్దాం. మరి పైసల సంగతేంది. మనిషి లెక్క మాట్లాడినవా, గుత్తగ సెప్పినవా..
- గా పార్టీ వాళ్లయితే మనిషికింత ఇస్తరు. ఇగ మిగతావోళ్లు గుత్త లెక్క ఇస్తరు.

ఏ పార్టీలో చూసినా ఇప్పుడు ఇదే తంతు కనపడుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు రెబల్‌ల సంఖ్య కూడా ఎక్కువగా ఉండడంతో కార్యకర్తలు తోక జాడిస్తున్నారు. బీరు, బిర్యానీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. అంతేగాదు మాంసాహారం పెట్టే వారి వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఇటు కార్యకర్తల కోరికలు తీర్చలేక మరోవైపు ప్రచారం చేస్తూ ప్రజలను ఆకట్టుకోలేక అభ్యర్థి సర్కస్ ఫీట్లు చేస్తున్నారంటే నమ్మి తీరాల్సిందే మరి.

కేసీఆర్ మాటలు నవీన్ యాదవ్‌కు ఆశీర్వాదాలు



ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయలు కొంటున్న మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్



ఎర్రగడ్డలోని ఏబి ఫంక్షన్ హాల్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



బలహీనవర్గాల కాలనీలో ప్రచారం చేస్తున్న రాష్ట్ర మంత్రి డా.సీతక్క, నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ దంపతులు

ఎర్రగడ్డ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ మాటలు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఆశీర్వాదాలు అవుతాయని, ఉప ఎన్నికలో విజయం సాధిస్తారని మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం ఎర్రగడ్డలోని రైతుబజార్‌లో వారు ప్రచారం చేశారు. కూరగాయలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జూబ్లీహిల్స్ ప్రజలకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అంటేనే భయం ఉండేదని, ఎన్ని క్రిమినల్ కేసులు పెట్టించారో ప్రజలకు తెలుసని అన్నారు. గోపీనాథ్ మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నా తాగునీటి సమస్య ఉందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.నాను, పి.ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా భావించి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఎర్రగడ్డలోని ఏబి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులను తక్కువ అంచనా వేయకూడదని, కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ రాజేష్‌రెడ్డి, దండె విఠల్, తెలంగాణ విజయ డైరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా రెపరెపలాడడం ఖాయం

బోరబండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా రెపరెపలాడడం ఖాయమని రాష్ట్ర మంత్రి డా. సీతక్క, నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు. బోరబండ డివిజన్ బలహీనవర్గాల కాలనీలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ విజయం కోసం కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ దంపతులతో కలిసి శనివారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ వారు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమం కోరుకునే వారు నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బండ్రు శోభారాణి, మువ్వా విజయ్ బాబు, ఖమ్మం కార్పొరేటర్ ఎం.డి.ముస్తఫా, బోరబండ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.అశోక్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, సిహెచ్.కవిత, ఎం.డి.యూసుఫ్, కాసుల మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల హామీలను నెరవేరుస్తాం : పొన్నం

యూసుఫ్‌గూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని వెంకటగిరి, కృష్ణానగర్ సి బ్లాక్‌లలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. యూసుఫ్‌గూడలో ఆటోడ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకరయ్య, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఆటో నడిపి ప్రచారం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఇళ్లకు కారు రావాలా? బుల్డోజర్ రావాలా?

- బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు
- మాగంటి సునీతగోపీనాథ్‌కు మద్దతుగా ప్రచారం



ఇస్లామిక్ పండితుడు మౌలానా సయ్యద్ అహ్మద్ నక్షందీతో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, పట్నం నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత



అంబేద్కర్ నగర్ బస్తీలో ప్రచారం చేస్తున్న మాగంటి అక్షర, దిశిర

వెంగళరావునగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'పేదోళ్ల ఇళ్ల కూలగొట్టుడు తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదు. ఎన్నికల తర్వాత మీ ఇళ్లకు కారు రావాల్నా.. బుల్డోజర్ రావాల్నా మీ చేతుల్లో ఉంది' అని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్‌కు మద్దతుగా నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీల్లో వారు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

వెంగళరావునగర్ డివిజన్‌లో..

కార్పొరేటర్ దేదీప్యవిజయ్ ఆధ్వర్యంలో మధురానగర్ బీ-బ్లాక్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, చామకూర మల్లారెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ తాతామధు, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. మాగంటి గోపన్న ఏది ప్రారంభించినా మధురానగర్ గడ్డ నుంచే ప్రారంభిస్తారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సునీత కోరారు.

బోరబండలో..

అభివృద్ధికి పెద్దపీట వేద్దాం.. గోపన్న ఆశయ సాధనలో కలిసి నడుద్దామని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బోరబండ డివిజన్ వినాయకరావు నగర్‌లో మాగంటి సునీతగోపీనాథ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్ కూడ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపు ఎప్పుడో తేలిపోయిందని, మెజార్టీ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

షేక్‌పేటలో..

షేక్‌పేట డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విస్తృత ప్రచారం చేశారు. పారామౌంట్ కాలనీలో ఆటో యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆకీమ్సా కాలనీలో మైనార్టీలతోనూ, రిలయన్స్ జూబ్లీ అసోసియేషన్ సభ్యులతోనూ ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కాగా, డెక్కన్ పార్కులో మార్నింగ్ వాకర్లను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విజ్ఞప్తి చేశారు.

రహ్మత్ నగర్‌లో..

రహ్మత్ నగర్ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, బంగారు మైసమ్మ ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

సోమాజిగూడలో..

ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్ నగర్ పరిసర ప్రాంతాల్లో మాగంటి అక్షర, దిశిరతో కలిసి ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. నగరానికి చెందిన ప్రముఖ ఇస్లామిక్ వక్త, పండితుడు, అహ్లె సున్నత్ వాల్ జమాత్ సభ్యుడు మౌలానా సయ్యద్ అహ్మద్ నక్షందిని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, పట్నం నరేందర్‌రెడ్డి కలిశారు. మాగంటి సునీతగోపీనాథ్‌కు మద్దతు తెలపాలని కోరారు. ఆయన సంపూర్ణ మద్దతు తెలిపారని వి.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను బాయ్‌కాట్ చేయండి

- బంగారు తెలంగాణ పార్టీ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించలేక పోవడాన్ని నిరసిస్తూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను బాయ్‌కాట్ చేయాలని బంగారు తెలంగాణ పార్టీ ఫౌండర్ ప్రెసిడెంట్ మహ్మద్ అమానుల్లా ఖాన్ కోరారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలకు, పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న వాహనాలపై నిషేధం విధించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులను బరిలోకి దించుతామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అభ్యర్థులు ఈసీ నిబంధనలను పాటించాలి



మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్ లాల్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థులు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తప్పక పాటించాలని వ్యయ పరిశీలకుడు సంజీవ్‌కుమార్ లాల్ అన్నారు. శనివారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థులతో కలిసి వ్యయ పరిశీలకులు సమావేశం నిర్వహించారు. ప్రతీ అభ్యర్థి ఖర్చు గరిష్ఠ పరిమితి రూ.40 లక్షలు అని తెలిపారు. ఖర్చులకు సంబంధించి అభ్యర్థులు డాక్యుమెంటేషన్ చేసుకోవాలన్నారు. ఖర్చుల వివరాలు నిర్దిష్ట గడువులోపు ఎన్నికల సంఘానికి సమర్పించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



క్యాన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విజయారెడ్డి జన్మదినం

ఖైరతాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి జన్మదినం సందర్భంగా ఆమె అభిమానులు, కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేశారు. ఖైరతాబాద్ మహాకాళి ఆలయంలో విజయారెడ్డి దీర్ఘాయుష్షు కోసం ప్రత్యేక పూజలు చేశారు. బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రోగుల సహాయకులకు, పేదలకు అన్నదానం చేశారు. పలు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, పాఠశాల విద్యార్థులకు స్వీట్లు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కరాటే రమేష్, శ్రీను యాదవ్, ప్రవీణ్ యాదవ్, హరికృష్ణ, గోపీగౌడ్ పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌కు సీనియర్ ఎంటమాలజిస్ట్ కార్యాలయం

ఖైరతాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ కార్యాలయం ఆబిడ్స్ సర్కిల్ కార్యాలయం నుంచి ఖైరతాబాద్ జోనల్ కార్యాలయానికి మారింది. ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం 1వ అంతస్తుకు మార్చామని సీనియర్ ఎంటమాలజిస్ట్ వై.గంగప్ప తెలిపారు. ఇక మీదట అన్ని అధికారిక ఉత్తర, ప్రత్యుత్తరాలు, కార్యాలయ సంబంధిత సమాచారాన్ని ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం 1వ అంతస్తులోని కొత్త కార్యాలయం నుంచి జరుగుతాయని ఆయన తెలిపారు.



కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

పేదల మేలు కోసం సహకారం : తలసాని

అమీర్‌పేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదల మేలు కోసం చేపట్టే కార్యక్రమాలకు తన సంపూర్ణ సహాయ, సహకారాలు ఉంటాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం సనత్‌నగర్‌లోని ఆదిత్యనగర్ కమ్యూనిటీహాల్‌లో శ్రీ మాతా సేవా సమితి ఆధ్వర్యంలో పలువురికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షురాలు కుసుమ విజయ, నాయకులు రాజేష్ ముదిరాజ్, షాబాద్ శ్రీనివాసరావు, సమితి సభ్యులు రమాదేవి, శోభ, రాధిక, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వాకర్ల సమస్యల పరిష్కారానికి కృషి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేబీఎన్‌వై పార్కు వాకర్ల సమస్యలను పరిష్కరిస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. శనివారం ఆయనను వాకర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌గౌడ్, గోపాలకృష్ణగౌడ్, బొడ్డు ప్రసాద్ గౌడ్ తదితరులు కలిశారు.



హిందీ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, శిక్షకులు

కృత్రిమ మేధతో హిందీ నేర్పడంపై వర్క్‌షాప్

ఖైరతాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ(ఏఐ) సహకారంతో హిందీ నేర్పడంపై ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ నిర్వహించారు. శనివారం లక్డీకాపూల్‌లోని హ్యాప్ షైర్ ప్లాజా హోటల్లో జరిగిన వర్క్‌షాప్‌లో దాదాపు 130 మంది హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హిందీ బోధన, సులభ అభ్యాసానికి సృజనాత్మక పద్ధతులు అనే అంశంపై న్యూ సరస్వతి హౌస్ పబ్లికేషన్స్ నిర్వహించిన వర్క్‌షాప్‌ను ప్రసిద్ధ విద్యావేత్త డాక్టర్ త్రిలోక్‌నాథ్ పాండే ప్రారంభించి మార్గనిర్దేశనం చేశారు. నిర్వాహక సంస్థ ఉపాధ్యక్షుడు స్వదేశ్ కుమార్, తెలుగు రాష్ట్రాల సీనియర్ జనరల్ మేనేజర్ బి.శరణ్ కుమార్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం ప్రకారం హిందీ బోధనను సరళవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.



బల్కంపేటలో అన్నప్రసాద వితరణ చేస్తున్న స్థానికులు

బల్కంపేటలో అన్నప్రసాద వితరణ

అమీర్‌పేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం ఎదురు ప్రాంగణంలో ముత్యాల కృష్ణ, ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం అన్నప్రసాద వితరణ చేశారు. దాతలు నెల్లూరు నారాయణ, జిన్నారం వెంకట్‌రెడ్డి సహకారంతో దాదాపు 800 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పోచమ్మ ఆలయ మాజీ ధర్మకర్త, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, అశోక్ యాదవ్, వనం శ్రీనివాస్, ఆకుల రాజు, మహేష్ యాదవ్, ముత్యాల నిఖిల్, సాయినాథ్ పాల్గొన్నారు.

ఆచూకీ చెప్పండి.. బహుమతి ఇస్తాం



నిందితుడు

ఖైరతాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హత్య కేసులో నిందితుడైన గుర్తు తెలియని వ్యక్తి చిత్రాన్ని పోలీసులు విడుదల చేశారు. ఇతడి ఆచూకీ చెప్పిన వారికి నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. డీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 5న ఉదయం ఒక గుర్తు తెలియని వ్యక్తిని ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ ఫుట్‌పాత్‌పైన బండరాయితో బాదడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అక్కడ సాక్షుల ద్వారా హత్య చేసిన వ్యక్తిని పోలీసులు గుర్తించినా, నిందితుడు మాత్రం పోలీసులకు చిక్కలేదు. దీంతో నిందుతుడి ఫొటోను విడుదల చేశారు. ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, పోలీస్‌స్టేషన్‌లో గాని, 8712661532లోగాని సంప్రదించాలని కోరారు.

ట్రావెల్స్ బస్సులను నిరంతరం తనిఖీ చేయాలి

కుత్బుల్లాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను నిరంతరం తనిఖీ చేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ యాదవ్ డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం నేపథ్యంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి శనివారం మేడ్చల్ జిల్లా రవాణా శాఖాధికారి రఘునందన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు స్వామి, హరినాథ్, కిష్టయ్య, గోపీ తదితరులు పాల్గొన్నారు.



కబ్జాలపై అధికారులతో చర్చిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి తదితరులు

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

● డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి

తార్నాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి అన్నారు. తార్నాక డివిజన్ పరిధిలో పలు చోట్ల ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయన్న సమాచారం మేరకు శనివారం తార్నాకలో పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించిన డిప్యూటీ మేయర్ ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని యత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా సంబంధిత అధికారులు ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, అనధికార నిర్మాణాలను, ఆక్రమణలు గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఆలయంలో సమావేశమైన ట్రస్ట్ సభ్యులు

ఆలయంలో అన్నప్రసాదం

అడ్డగుట్ట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్‌లోని పహాడి హనుమాన్ ఆలయంలో ప్రతి నెలా చివరి శనివారం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్నామని ఆలయ చైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యుల సమావేశానికి ముఖ్యఅతిథిగా సుజన్ బాబు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధిలో ఈ కమిటీ సభ్యుల పాత్ర గొప్పదని ఆయన అన్నారు. కమిటీ సమావేశంలో ప్రతినెలా చివరి శనివారం అన్నప్రసాదం ప్రారంభించామన్నారు. శనివారం కూడ అన్నప్రసాదం పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు సంతోష్ కుఆర్, విష్ణు, ప్రకాశ్, విజయలక్ష్మిలు పాల్గొన్నారు.



వాస్తుశాంతి, పర్యగ్నీకరణ కార్యక్రమంలో పాల్గొన్న అభినవోద్ధండ విద్యాశంకర్ భారతీమహాస్వామి, తదితరులు

ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలి

● విద్యాశంకర భారతీమహాస్వామి

బౌద్ధనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు తరచూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని పుష్పగిరి మహాసంస్థాన్ పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి అన్నారు. సికింద్రాబాద్ శ్రీనివాసనగర్ శ్రీగిరి పద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జీర్ణోద్ధరణ పూర్వక మహా సంప్రోక్షణ మహాకుంభాభిషేకంలో భాగంగా శనివారం నిర్వహించిన వాస్తుశాంతి, పర్యగ్నీకరణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అనుగ్రహభాషణం చేశారు. ప్రజల్లో భక్తిభావం పెరిగితే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరుస్తాయని, నిత్య వేదపారాయణంతో అంతరాత్మ పరిశుద్ధం అవుతుందని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్‌కుమార్, కమిటి అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావు, దేవదాయశాఖ స్థపతి వలినాయగం, కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మారామ సూర్యసుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, శివశంకరన్, నారాయణన్, సుజయ్ ప్రకాశ్, శ్రీహరి, షణ్ముఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగుల చవితి పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

తిరుమలగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లాల్‌బజార్‌లోని నాగదేవత ఆలయంలో శనివారం నాగుల చవితి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు ఆలయానికి వచ్చి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుమలగిరి పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ ఆంథోనియమ్మ పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు.


మెట్టుగూడలో..

చిలకలగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సర్ప దోషాలు, భయాలు తొలగిపోవడానికి శనివారం మెట్టుగూడలో నాగులచవితి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుండే మహిళలు పుట్టల వద్దకు చేరుకుని పాలు పోసి పండ్లు, కోడి గుడ్డు వంటివి ప్రసాదంగా నివేదన చేశారు. చింతబావి రైల్వే క్వార్టర్స్, మూడు కట్టల మధ్య ఉన్న ముత్యాలమ్మ ఆలయం, ఆలుగడ్డబావి హనుమాన్ ఆలయాల వద్ద ఉన్న పుట్టలలో పాలు పోసి, పూజలు నిర్వహించారు.

ఆకట్టుకుంటున్న రాక్ ఆర్ట్స్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రాక్ ఆర్టిస్ట్ డాక్టర్ వెంకట్ రూపొందించిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఓయూ లైబ్రరీలో ఉద్యోగిగా పనిచేస్తున్న ఆయన ప్రకృతిలోని బండరాళ్లలో దాగి ఉన్న కళారూపాలను గుర్తించి వాటిని సృజనాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ఓ బండరాయి మీద భారత రాజ్యాంగ శిల్పి అంబేద్కర్ చిత్రపటంతో పాటు భారత పార్లమెంట్, రాజ్యాంగ ప్రతిరూపాలను గీశారు. "ప్రకృతిలో ప్రతి రాయిలో ఒక రూపం దాగి ఉందని మనం గుర్తించాలన్నారు. అలాగే కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలని ఆయన కోరారు.

ఆదివాసీ బిడ్డ వెంకన్నకు ఓయూ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వెంకన్న

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాటి ఓరుగల్లు నేటి మహబూబాబాద్ జిల్లాలోని మారుమూల ఆదివాసీ గూడెంకు చెందిన నిరుపేద ఆదివాసీ కల్తీ పాపయ్య, వెంకటమ్మ దంపతుల కుమారుడు వెంకన్న ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. హిస్టరీ విభాగంలో ప్రొఫెసర్ (లేట్) రామకృష్ణ, ప్రోటెం సూపర్‌వైజర్ డాక్టర్ పి.రమేష్ పర్యవేక్షణలో "ఫారెస్ట్ ఆఫ్ ద నిజాం గవర్నమెంట్ ఇన్ హైదరాబాద్ రాష్ట్రం, ఇట్స్ ఇన్పాక్ట్ ఇన్ ట్రైబల్ ఆఫ్ తెలంగాణ రీజియన్- ఏ స్టడీ" అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. తన పరిశోధనకు సహకరించిన ఆచార్యులు, ఆత్మీయులు, స్నేహితులు, బంధుమిత్రులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బోర్డు పాలనపై సీఈఓ పట్టుకోసం యత్నం




అర్వింద్‌కుమార్ ద్వివేదీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ చిత్రంలో మధుకర్ నాయక్

సికింద్రాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ నూతన సీఈఓ అర్వింద్‌కుమార్ ద్వివేది బోర్డు పాలనపై పట్టుబిగించే యత్నం చేస్తున్నారు. కంటోన్మెంట్ ప్రతిష్ఠను మరింత ఇనుమడింప చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పని చేద్దామంటూ అధికారులు, ఉద్యోగుల్లో ఉత్సాహం నింపుతున్నారు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉండాలని, ప్రజలతో, ప్రజాసమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరి పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ ముందుకు సాగాలని హితవు పలికారు. అలాగే కొందరు అధికారులతో కలిసి కంటోన్మెంట్‌లోని అన్ని వార్డుల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, కంటోన్మెంట్ నైసర్గిక స్వరూపం, సమస్యల పట్ల పూర్తిస్థాయి అవగాహన పెంచుకుంటున్నారు. అదేవిధంగా కంటోన్మెంట్ బోర్డులోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తూ, ప్రస్తుతం పట్టిపీడిస్తున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, పెండింగ్ పనులు, ప్రస్తుతం అన్ని వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల గురించి సమీక్షిస్తున్నారు. తద్వారా కంటోన్మెంట్ బోర్డు పాలనపై పూర్తి స్థాయి పట్టు బిగించే పనుల్లో అర్వింద్‌కుమార్ ద్వివేది నిమగ్నమయ్యారు.

రాబడి మార్గాలపై ప్రత్యేక దృష్టి

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆర్థిక పరిస్థితి గురించి అధికారులకు, ఉద్యోగులకు పూర్తిగా తెలిసినందున రాబడి మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ట్యాక్స్ విభాగం సహా రాబడికి అవకాశాలు వచ్చే విభాగాలు మరింత శ్రద్ధతో పని చేయాలని కోరారు.

నేడు సామూహిక సుదర్శన నర్సింహ హోమం



హోమం కోసం ఏర్పాటు చేసిన హోమ గుండాలు



కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక అలంకరణతో వేంకటేశ్వర స్వామి

బోయినపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సామూహిక సుదర్శన హోమం అనేది విష్ణువు సుదర్శన చక్రం, నరసింహ దేవుని ఆశీర్వాదాలను పొందడానికి నిర్వహించే ఒక పవిత్రమైన యాగం. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బోయినపల్లి న్యూ సిటీ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రధాన అర్చకుడు పవన్‌స్వామి ఆధ్వర్యంలో పెద్దఎత్తున సామూహిక సుదర్శన నర్సింహా హోమం జరగనున్నది. ఉదయం ఎనిమిది గంటల నుంచి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ హోమం చేపట్టనున్నారు. ముందుగా స్వామివారిని ఉత్తర ద్వారం ఎదురుగా ఆలయ వీధిలో భక్తులు సందర్శించేలా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. అగ్ని ప్రతిష్ఠ చేసి మూల మంత్ర హోమం, సుదర్శన శతకం, మాల మంత్ర ప్రత్యేక పూజలు, హోమం ప్రారంభం అవుతాయని హోమం నిర్వహించి పూర్ణాహుతి, ఆశీర్వచనంతో సుదర్శన హోమం పరిపూర్ణమవుతుందని ఆలయ అర్చకుడు వెల్లడించారు.

ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో ఇక్కడ ఈ సామూహిక సుదర్శన నర్సింహా హోమం నిర్వహిస్తున్నట్లు, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అర్చకుడు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆలయంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రత్యేక ఆలంకరణలతో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హోమం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

బీసీ రిజర్వేషన్లపై కేంద్రం వైఖరి ప్రకటించాలి



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ స్టూడెంట్స్ జేఏసీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : 42శాతం బీసీ రిజర్వేషన్లపై కేంద్రం వైఖరిని ప్రకటించాలని బీసీ స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ కొమ్మనబోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం కేంద్రం ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జంపాల రాజేష్, సలహాదారులు వలిగొండ నరసింహ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెడితే అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. కేంద్రం ప్రభుత్వం కూడా శీతాకాల సమావేశంలో బిల్లును ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రం మంత్రులు, ఎంపీలు అందరూ ఈ విషయంపై ప్రధానిపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే రాజీనామాలు చేయడానికైనా సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్, అధ్యక్షులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, వెంకట్, చీరాల వంశీ, మామిడాల రవి కుమార్, కోలా శేఖర్, వెంబటి అభిలాష్, శ్రీధర్ యాదవ్, ప్రణయ్ భాస్కర్, సామజిక ఉద్యమం నాయకులు పెండ్యాల విక్రమ్ పురం వెంకటేష్, బాలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై హైడ్రాకు ఫిర్యాదు

ముషీరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భోలక్‌పూర్ డివిజన్ కవాడిగూడ తాళ్ళబస్తీ కమ్యూనిటీహాల్ ఎదురుగా రోడ్డును ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని స్థానికుడు చంద్రప్రకాష్ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో చంద్రప్రకాష్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణంపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని అందుకు సంబంధించిన ఫొటోలను అందజేశానని తెలిపారు. ఫుట్‌పాత్ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులకు సైతం ఫిర్యా దు చేశామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు. ఇప్పటికైనా హైడ్రా కమిషన్ ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయం ఖాయం

ముషీరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం భోలక్‌పూర్‌కు చెందిన బీజేపీ నాయకులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దీపక్‌రెడ్డిని బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కనకేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ పార్టీ గెలుపునకు కృషిచేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, సాయి, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలి

● బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నేతలు అంకితభావంతో పనిచేయాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం మీడియా సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకులు పి. శ్రీధర్ చారి, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, కరికె కిరణ్‌లు ముఠా జైసింహను కలిసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో చేపడుతున్న కార్యక్రమాలు, ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను వివరించి జైసింహను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాగంటి సునీత గెలుపు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

27 షాపులు.. 830 దరఖాస్తులు

తిరుమలగిరి అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎక్సైజు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరువది ఏడు మద్యం షాపులు ఉన్నాయి. అయితే కొత్త షాపుల కోసం ఎనిమిది వందల ముప్పై మంది దరఖాస్తు చేసుకున్నారని ఇన్‌స్పెక్టర్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అధికంగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. డిసెంబరు ఒకటి నుంచి కొత్తవి ప్రారంభమవుతాయని, లక్కీ లాటరీ విధానంతో అలాట్ చేస్తారని అన్నారు.

నవీన్ యాదవ్‌కు ఓయూ జేఏసీ మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి మద్దతు ప్రకటించారు. శనివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద చలో జూబ్లీహిల్స్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని జూబ్లీహిల్స్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చాగంటి రాములు, జేఏసీ సెక్రటరీ ముక్క రమేష్, జేఏసీ నాయకులు రాజేందర్, అరుణ్, కుమార్ చరణ్, ప్రణయ్, శీను, మహేష్, ప్రణయ్, సంతోష్, మహేందర్, రాంబాబు, పూర్ణచందర్, కుమార్ శ్రీనివాస్, రాజు, ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగినీ హస్త భోజనం



భగినీ హస్తభోజనం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

మల్కాజిగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి అనంతరం అన్నదమ్ములను తమతమ ఇళ్లకు ఆహ్వానించి సహపంక్తి భోజనాలకు సోదరీ మణులు ఆహ్వానించే భగినీ హస్త భోజనం (బావుబిజీ) శనివారం మల్కాజిగిరిలో ఘనంగా జరిగింది. బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి జీడి బాలచందర్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు శ్రీ సాయిదత్త పీఠాధిపతులు శ్రీ రామనందప్రభుజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన పలువురికి భగినీ హస్తభోజనాన్ని ఏర్పాటు చేశారు. పీఠాధిపతులు శ్రీ రామచంద్రప్రభూజీ, ఎంపీ ఈటెలలు మాట్లాడుతూ ఎవరైతే ఈ రోజున సోదరి ఇంటికి వెళ్లి భోజనం చేస్తారో వారికి అపమృ త్యు దోషాలు ఉండవని శాస్త్రపురాణాలు చెపుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గంపా నాగేశ్వర్ రావు, సూర్యనారాయణమూర్తి, రామకృష్ణ, జూలూరి శ్రీనివాసులు, దేవదాసు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓయూ పీఎస్ ఎదుట నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బేకరిలో బీఫ్ పదార్థాలు అమ్ముతున్నారని బజరంగ్ దళ్ కార్యకర్తలు, స్థానిక బస్తీ వాసులు ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం నిరసన చేపట్టారు. సీతాఫల్‌మండి ఫ్లై ఓవర్ పక్కన పిట్టల బస్తీలోని ఓ బేకరిలో బీఫ్‌కు సంబంధించిన తినుబండారాలను అమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బేకరి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బేకరి యజమానికి బీఫ్ విక్రయించడానికి లైసెన్స్‌తో పాటు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తెలిపారు. బస్తీ వాసులకు, బజరంగ్ దళ్ కార్యకర్తలకు అర్థమయ్యేలా వివరించి పంపించారు.



అవగాహన శిబిరం నిర్వహిస్తున్న టెక్ మహీంద్రా ఫౌండేషన్, అప్సా స్వచ్ఛంద సంస్థల సభ్యులు

ఉచిత కోర్సులపై అవగాహన శిబిరం

బౌద్ధనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టెక్ మహీంద్రా ఫౌండేషన్, అప్స స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సీతాఫల్‌మండి మీసేవ వద్ద వివిధ కోర్సులపై నిరుద్యోగ యువతీ, యువకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్సా ప్రాజెక్ట్ మేనేజర్ షేక్ మౌలానా మాట్లాడుతూ మహీంద్రా స్మార్ట్ ఉపాధి శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, టాలీ విత్ జీఎస్టీ కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ టైపింగ్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టూల్స్ వినియోగంపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ముషీరాబాద్‌లో గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్నా అప్సా-టెక్ మహీంద్రా స్మార్ట్ శిక్షణ కేంద్రంలో సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ భాస్కర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జయ, ఫెసిలిటేటర్లు హరిప్రకాశ్, జయశ్రీ, విద్య, చందనా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని పరామర్శించిన మంత్రి



వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుతో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పరామర్శించారు. జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంపు ఎస్సీ హాస్టల్ విద్యార్థి హిమేష్‌కు పిడుగు పడి గాయాలపాలయ్యాడు. విద్యార్థిని మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. శనివారం మంత్రి హిమేష్‌ను ఆస్పత్రిలో పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇప్పటికే అత్యవసర చికిత్స కోసం రూ.5 లక్షలు మంజూరి చేశారు. ఎస్సీడీడీ అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్, హైదారాబాద్ డిడి ప్రవీణ్ రెడ్డి, ఏడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



తేజశ్వినిని శాలువాతో సన్మానిస్తున్న ఆర్‌పీఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గాలి వినోద్ కుమార్ తదితరులు

తార్నాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని కెఎంసీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన కందుకూరి తేజశ్వినిని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు గాలి వినోద్ కుమార్ శనివారం తార్నాకలోని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో శాలువాతో ఘనంగా సత్కరించడంతో పాటు, ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో గర్వించదగ్గ విషయమని కొనియాడారు. నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు ఆర్‌పీఐ పార్టీ భవిష్యత్తులో కోటి రూపాయల విద్యానిధిని ఏర్పాటు చేస్తుందని తెలిపారు.



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

'సీఏఎస్ ఇంటర్వ్యూల్లో అవకతవకలపై నిజనిర్ధారణ కమిటీ వేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన సీఏఎస్ ఇంటర్వ్యూలో చాలామంది అధ్యాపకులకు ప్రమోషన్ రాకుండా రిజెక్ట్ చేశారని, ఇంటర్వ్యూల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ నిజనిర్ధారణ కమిటీ వేయాలని ఔటా అధ్యక్షులు ప్రొఫెసర్ మనోహర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం లంచ్ అవర్‌లో ఆర్ట్స్ కళాశాల ఎదుట అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ 22 రోజులకు పైగా అధ్యాపకులు నిరసనలు చేస్తున్నా వర్సిటీ అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రమోషన్ల విషయంలో అధ్యాపకులకు న్యాయం జరిగే వరకూ వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధ్యాపకులకు రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (భీమ్ రావు అంబేడ్కర్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గాలి వినోద్ కుమార్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నతానియల్, వెంకట దాస్, సుజాత, రామచందర్, గంగాధర్, అపర్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.